www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 09 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-122 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# కంచర్ల చూపు కాంగ్రెస్ వైపు ?

## రేవంత్‌తో ఉన్న సానిహిత్యం • కోమటిరెడ్డి బ్రదర్స్‌తో వైరం • కలిసిరానున్న పొలిటికల్ వ్యూహం

మునుగోడు బై పోల్ .... ఆశావాహుల్లో గుబులు ♦ టీఆర్ఎస్ టికెట్‌ను ఆశిస్తున్న కంచర్ల క్రిష్టారెడ్డి ♦ కూసుకుంట్లకు అనుకూలంగా సర్వే రిపోర్టులు





### కోమటిరెడ్డి బ్రదర్స్ X కంచర్ల బ్రదర్స్ ....?



నల్లగొండ జిల్లా రాజకీయాలు శరవేగంగా పెనుమార్పులు సంభవించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. ఇటీవల కేసీఆర్ పీకే సర్వేలో నల్లగొండ సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పై నెగటీవ్ రిపోర్టు రావడంతో వచ్చే సాధారణ ఎన్నికలలో కంచర్ల భూపాల్‌రెడ్డి సీటుకు ప్రత్యమ్నాయ అభ్యర్థికి టికెట్ కెటాయించే అవకాశం ఉండటంతో, కంచర్ల భూపాల్‌రెడ్డి తన భవిష్యత్ కార్యచరణపై వేగం పెంచాడని తెలుస్తుంది. ఇప్పటికే తన సోదరుడు కంచర్ల క్రిష్ణారెడ్డి గత సంవత్సర కాలం నుంచి మునుగోడు నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలు చేస్తూ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో సాధారణ ఎన్నికల కంటే ముందే ఉపఎన్నిక రావడంతో తమ సుదీర్ఘ ప్రణాళిక కాస్తా తలకిందులైంది. ప్రస్తుత సర్వేల ప్రకారం ఉప ఎన్నికలో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి టికెట్ రావడం ఖాయమౌతున్నట్లు తెలుస్తుంది. టికెట్ ఆశించిన కంచర్ల కృష్ణారెడ్డికి మొండిచెయ్యి చూపించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలుస్తుంది. దీనితో టికెట్ రాని పక్షంలో ప్రత్యమ్నాయ ప్రతికూలపరిస్థితులను ఎదుర్కునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

- నల్లగొండ రాజకీయాలపై రేవంత్‌రెడ్డి సరికొత్త వ్యూహం
- కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రత్యమ్నాయంగా కంచర్ల బ్రదర్స్
- కాంగ్రెస్ నుంచి బరిలోకి కంచర్ల కృష్ణారెడ్డి ?
- కంచర్ల భూపాల్‌రెడ్డిపై పీకే సర్వే ఎఫెక్ట్
- గుత్త సుఖేందర్‌రెడ్డికి కలిసివచ్చే అవకాశం

**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీలో కొంత కాలంగా కోమటిరెడ్డి బ్రదర్స్‌తో రేవంత్‌రెడ్డికి వైరం తారాస్థాయికి చేరుకుంది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు రేవంత్‌రెడ్డిపై విరుచుకు పడటంతో వారికి చెక్‌పెట్టేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల రేవంత్‌తో కంచర్ల బ్రదర్స్ రహస్య భేటీ జరిగిందని, నల్లగొండలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి బలమైన ప్రత్యర్థి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కావడంతో భూపాల్‌రెడ్డిపై టీపీసీసీ రేవంత్‌రెడ్డి కన్నుపడింది. ఈ క్రమంలో సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కంచర్ల భూపాల్‌రెడ్డి, మునుగోడు అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డిని నిలబెట్టి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి చెక్‌పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్లాన్ వేసినట్లు సమాచారం. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో మునుగోడు ఉప ఎన్నిక బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి పోటీ చేయడానికి ససేమిరా అన్నారని, అలా చేస్తే ప్రస్తుతం కంచర్ల భూపాల్‌రెడ్డికి చిక్కులు వచ్చే ప్రమాదం ఉండటంతో అలాంటి నిర్ణయం తీసుకోలేదని సన్నిహితుల సమాచారం.

**కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రత్యమ్నాయంగా కంచర్ల బ్రదర్స్**

ఇప్పటికే టి.పీసీసీ రేవంత్‌పై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసంతృప్తి కారణంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీ పార్టీలోకి వెళుతున్నట్లు వార్తలు రావడంతో, అందుకు ప్రత్యమ్నాయంగా రేవంత్‌రెడ్డి కంచర్ల బ్రదర్స్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అన్ని అనుకున్నట్లు జరిగితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా కంచర్ల బ్రదర్స్‌ను సాధారణ ఎన్నికలలో నల్లగొండ అసెంబ్లీ స్థానం టికెట్‌ను భూపాల్‌రెడ్డికి, మునుగోడు అసెంబ్లీ స్థానాన్ని కంచర్ల క్రిష్ణారెడ్డికి కెటాయింపులు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో కోమటిరెడ్డి బ్రదర్స్

2వ

## వెంకయ్యనాయుడుతో పనిచేయడం అదృష్టం

- ఆయన పనితీరు నేటి యువతకు ఆదర్శం
- యువ ఎంపిలకు ఆయన ప్రేరణగా నిలిచారు
- రాజ్యసభలో పనితీరు మెరుగు పడింది
- ఆయన భాషతో ఆకట్టుకునే ప్రసంగం అందరికీ ఆదర్శం
- రాజ్యసభలో వెంకయ్యనాయుడి వీడ్కోలులో ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 (సమ సమాజం):** ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో కలసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రధాని మోడీ అన్నారు. వెంకయ్య పదవీకాలంలో రాజ్యసభ పనితీరు గణనీయంగా మెరుగుపడిందని గుర్తు చేశారు. ఈ నెల 10న వెంకయ్య పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో.. రాజ్యసభలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్రసంగించిన మోదీ.. వెంకయ్యకు ధన్యవాదాలు తెలిపారు. పదవీకాలాన్ని పూర్తి చేసుకుంటున్న వెంకయ్య నాయుడికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. వెంకయ్య సమక్షంలో

2వ

## స్వాతంత్ర్య స్ఫూర్తిని ముందుతరాలకు చాటాలి



- సిపాయిల తిరుగుబాటు నుంచి గుణపాఠంతో ఉద్యమించారు
- మహాత్ముడిని కించపరిచే వెకిలి చేష్టలను తిప్పికొట్టాలి
- గాంధీ ప్రపంచానికే స్ఫూర్తి ప్రదాత
- వీరుల త్యాగాలను ఎప్పటికీ విస్మరించకుండా సాగాలి
- దేశ ఐక్యత కోసం ఎందరో త్యాగధనుల కృషి
- వజ్రోత్సవ వేడుకల్లో సిఎం కెసిఆర్ పిలుపు

**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** దేశంలో మహాత్మాగాంధీని అవమానించే పరిస్థితి ఏర్పడిందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. జాతిపిత గాంధీజీని కొందరు కించపరిచేలా ప్రవర్తిస్తున్నారని.. మహాత్ముడు ఎప్పటికీ మహాత్ముడుగానే ఉంటాడని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. మనం స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు ఎందరో ప్రాణత్యాగం చేశారని తెలిపారు. అనేక త్యాగాలు, పోరాటాలతో దేశానికి స్వాతంత్యం వచ్చిందన్న ముఖ్యమంత్రి.. ఏ దేశానికైనా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఒక అపురూప సందర్భమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో స్వాతంత్య భారత వజ్రోత్సవాలు అద్భుతంగా జరగాలని ఆకాంక్షించారు.సోమవారం హెచ్ఐసీసీలో స్వతంత్ర భారత వజ్రోత్సవాలు ప్రారంభించిన ముఖ్యమంత్రి ఆపై జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సీఎం

2వ

## కోమటిరెడ్డి రాజీనామా సమాచారం ఇసికి

### గుజరాత్, హిమాచల్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే ఉప ఎన్నిక



**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కలిసి తన రాజీనామా లేఖను అందజేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామా లేఖను స్పీకర్ ఆమోదించారు. రాజీనామా సమర్పించిన కొన్ని నిమిషాలకే స్పీకర్ ఆమోదం తెలిపారు. దీంతో మునుగోడు ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. నేడు ఈసీకి స్పీకర్ కార్యాలయం సమాచారం ఇవ్వనుంది. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు మునుగోడు ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉంది. కాగా ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన రాజగోపాల్‌రెడ్డి.. తన ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 21న అమిత్ షా సమక్షంలో అధికారంగా బీజేపీలో చేరనున్నారు. అదే రోజు కోమటిరెడ్డిని మునుగోడు అభ్యర్థిగా బీజేపీ ప్రకటించనుంది.

## వరదనష్టంపై కాంగ్రెస్ పోరుబాట

- నేటి నుంచి రెండు నియోజకవర్గాల్లో పాదయాత్ర
- 75 కిలోమీటర్ల మేర పర్యటిస్తూ రైతులతో చర్చలు

**ఆసిఫాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** ప్రధాన విపక్షమైన కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఇప్పటికే అన్ని నియోజకవర్గకేంద్రాల్లో ధర్నాలు నిర్వహించింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల9నుంచి మూడురోజులపాటు జిల్లాలోని రెండు నియోజక వర్గాల్లో 75కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఇటీవలి భారీ వర్షాల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్న డిమాండుతో ఆ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావులు ఆందోళనలకు దిగారు.

## మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రాజీనామా

- స్పీకర్ పోచారంను కలసి రాజీనామా పత్రం అందచేత
- రాజీనామా ఆమోదించాడని వెల్లడించిన రాజగోపాల్
- గన్ పార్క్ వద్ద అమరుల స్థూపం వద్ద నివాళి
- మునుగోడు తీర్పుతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు
- కెసిఆర్ కుటుంబ పాలనపై ధర్మయుద్ధం ప్రారంభించా
- మీడియా ముందు వెల్లడించిన రాజగోపాల్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి

2వ

## విద్యుత్ బిల్లుకు నిరసనగా ఆందోళన

### కెటిపిఎస్ ముందు నిరసనలు

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్ట్ 8 (సమ సమాజం):** కేంద్రం పార్లమెంట్లో ప్రవేశపెడుతున్న విద్యుత్ చట్ట సవరణ బిల్లుకు నిరసనగా జిల్లాలో ఆందోళనల కొనసాగాయి. జిల్లాలోని గణపురం మండలం చెల్పూర్ కేటీపీపీ ప్రధాన గేటు ముందు విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో కేటీపీపీ ఉద్యోగులు విధులు బహిష్కరించి ధర్నాచేపట్టారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంఎ÷-లాయిస్ అండ్ ఇంజినీరింగ్ జేఏసీ దేశ వ్యాప్త విధులు బహిష్కరణ పిలుపు మేరకు.. నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్లమెంటులో చట్టం కాబోతున్న విద్యుత్ చట్టసవరణ బిల్లు కార్యరూపం దాలిస్తే దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యుత్‌రంగం ధ్వంసం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తగ్గకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సంపాదకీయం

## దేశాన్ని కదిలించిన క్విట్ ఇండియా పిలుపు !

మహోన్నతమైన మన గత చరిత్రను, స్వాతంత్ర్యోద్యమ ప్రాముఖ్యతను మన భవిష్యత్ తరాలతో పంచు కోవడం మన బాధ్యత. 75 సంవత్సరాల క్రితం ఈ దేశ స్వేచ్ఛ కోసం ఎంతటి మూల్యాన్ని చెల్లించవలసి వచ్చిందో నేటితరం తెలుసుకోవాలి. అందుకే స్వాతంత్ర్యానికి సంబంధించి ఈ సంవత్సరాన్ని అమృత సంవత్సరంగా పరిగణిస్తున్నాము. దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడి కూడా అంతగా గుర్తింపు తెచ్చుకోని కొందరు వీరుల గాథలతో వారి త్యాగాలను గుర్తించే విధంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి నేడు దేశంలో, వారు చేసిన త్యాగాలు మాత్రమే కాదు, వాటి ద్వారా భవిష్యత్ తరాలకు ఎనలేని ప్రేరణ కలిగించారు. ఇందులో క్విట్ ఇండియా ఉద్యమానికి ఎనలేని ప్రాధాన్యం ఉంది. అదే మనకు స్వాతంత్ర్యం దక్కేలా చేసింది. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆగస్టు నెలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. సహాయ నిరాకరణోద్యమం 1920 ఆగస్టు 1వ ప్రారంభమైంది. క్విట్ ఇండియా ఉద్యమం 1942 ఆగస్టు 9న మొదలైంది. దీన్ని ఆగస్టు క్రాంతి అని పిలుస్తారు. భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న వచ్చింది. క్విట్ ఇండియా అనే గాంధీజీ పిలుపుతో ఇండియా ఉద్యమంలో నిర్ణయాత్మకంగా మారింది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం అనేది ఎంతో ముఖ్యమైన మైలురాయిగా చెప్పు కోవాలి. ఈ ఉద్యమం బ్రిటిష్ పాలన నుంచి భారతదేశాన్ని ఎలాగైనా విముక్తి చేయాలనే దృఢ సంకల్పం ప్రతి ఒక్క భారతీయుడిలో రగిలించింది. ఈ సమయంలోనే దేశ ప్రజలంతా ఏకమయ్యారు. గ్రామాలు నగరాలు, విద్యాసంస్థలు, నిరక్షరాసులు, ధనికులు, పేదలనే తేడాలు లేకుండా క్విట్ ఇండియా ఉద్యమం కోసం దేశంలోని నలుమూలల నుండి ప్రజలు తరలివచ్చారు. కర్షకులు తెంచుకున్న ఆగ్రహంతో ఉద్యమంలో భాగస్వామ్యులయ్యారు. లక్షలాది మంది ప్రజలు మహాత్మాగాంధీ అందించిన డూ ఆర్ డై అనే నినాదాన్ని ఎవరికి వారే మంత్రంగా మార్చుకుని తమను తాము పోరాటానికి అంకితం చేసుకున్నారు. దేశంలోని యువత తమ పుస్తకాలను, అధ్యయనాలను త్యజించి మరీ కదనకు బయలుదేరారు. మహాత్మాగాంధీ 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొన్న ప్రతీ ప్రముఖ నాయకున్నీ బ్రిటిష్ ప్రభుత్వం జైలుపాలు చేసింది. ఈ సమయంలోనే డా. రామ్ మనోహర్ లోహియా, జయ ప్రకాష్ నారాయణ, అరుణ అసఫ్ అలీ వంటి గొప్ప వ్యక్తులతో కూడిన రెండోశ్రేణి నాయకత్వం కీలక పాత్ర పోషించింది. నిజానికి బ్రిటిష్ అరాచక పాలనలో కుతకుతలాడుతున్న భారతీయులు.. 'చావో రేవో' అంటూ గాంధీజీ ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో ఉవ్వెత్తున పోరాట బరిలోకి దూకిన అద్భుత ఘట్టం అది. సామాచార వ్యవస్థ నామమాత్రంగా ఉన్న ఆ రోజుల్లో.. దేశంలోని ప్రతి మూల ప్రజలు ఎవరికి వారే నాయకులై.. కదం తొక్కిన చారిత్రక సంగ్రామం. అదే క్విట్ ఇండియా. అనేక పోరాటాల సమాహారమైన భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అదో మైలురాయి. నిజానికి ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించే నాయకుడంటూ ఎవరూ అప్పటికి అందుబాటులో లేరు. ఉద్యమానికి ఊపిరి పోసిన గాంధీజీ, నెహ్రూ వంటి అగ్రనేతలందరినీ బ్రిటిష్ ప్రభుత్వం జైల్లో పెట్టింది. దిశానిర్దేశం చేసే మార్గదర్శకులు ఎవరూ లేకున్నా.. ప్రజల సమరోత్సాహంతో ఆ ఉద్యమం మహోజ్వలంగా సాగింది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అగ్రగణ్యులు లోకమాన్య బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలేల విజ్ఞప్తి మేరకు 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు వచ్చిన మహాత్ముడు 1917 నుంచి 1942 వరకు దాదాపు 25 ఏళ్లపాటు వివిధ రకాల ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ అనుకున్న లక్ష్యం అందకుండా పోతోందనే ఆవేదన ఆయనలో గూడు కట్టుకుపోయింది. 1942 జూన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'నేను అసహనానికి గురవుతున్నాను' అని వ్యాఖ్యానించడమే ఇందుకు ఉదాహరణ. ఈ ఇంటర్వ్యూ ఇచ్చిన రెండు నెలలకే ఆగస్టు 8న క్విట్ ఇండియా ఉద్యమానికి మహాత్ముడు పిలుపునిచ్చారు. 'విజయమో.. వీర స్వర్గమో' అంటూ గర్జించారు. భారత్‌కు వచ్చిన మహాత్మాగాంధీ 1917 నుంచి 1942 వరకు దాదాపు 25 ఏళ్లపాటు వివిధ రకాల ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ అనుకున్న లక్ష్యం అందకుండా పోతోందనే ఆవేదన ఆయనలో గూడు కట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో 1942.. ఆగస్టు ఎనిమిదో తేదీన బొంబాయిలోని గోవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ అగ్రనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భం గా స్వరాజ్యం కోసం పార్టీ కార్యవర్గ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రజలంతా కొత్త గాంధీని చూశారు. ఆయన నోటి వెంట సమర గర్జనను విన్నారు. భారతీయులంతా అప్పటికి అనేక సంవత్సరాలుగా అలుపెరగక పోరాడుతున్నా.. ఉద్యమ ఫలం 'అందని ద్రాక్షగా' ఉందని ఆయన ఆవేదన చెందారు. అదే 'క్విట్ ఇండియా' పిలుపునకు దారితీసింది. రెండో ప్రపంచ యుద్ధంలో తమకు సహకరిస్తే.. స్వయం పాలన ఇస్తామని చెప్పిన బ్రిటిష్ పాలకులు చివరకు వచ్చేసరికి 'డొమినియన్ స్టేటస్' అంటూ మెలిక పెట్టింది. ఈ ప్రతిపాదనను భారతీయులు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఈ మెలికపై తీవ్రస్థాయిలో మండిపడిన కాంగ్రెస్ పార్టీ భారతీయులకు స్వాతంత్ర్యం ఇచ్చే ఉద్దేశం బ్రిటిష్ వారికి లేదన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చింది. అనంతరం వార్ధాలో సమావేశమై బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రజలను కార్యోన్ముఖులను చేస్తూ భారీ ఉద్యమం చేపట్టాలని తీర్మానించింది. గాంధీజీ పిలుపుతో ఆగస్టు 9న పుణె, అహ్మదాబాద్‌లలో లక్షల మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేశారు. పదో తేదీన ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో నిరసనలు మిన్నంటాయి. క్రమంగా ఉద్యమం దేశవ్యాప్తంగా గ్రామస్థాయికి విస్తరించింది. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరాహార దీక్షలు చేశారు. కళాశాలల విద్యార్థులు తరగతులు బహిష్కరిం చారు. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, పోస్టాఫీసులు, రైల్వేస్టేషన్లపై ఆందోళనకారులు దాడులు చేశారు. చాలా చోట్ల రైలు పట్టాలను తొలగించారు. వంతెనలు, టెలిఫోన్ స్తంభాలను కూల్చివేశారు. మరో వైపు.. బ్రిటిష్ సర్కారు దొరికిన వారిని దొరికినట్లు జైళ్లలో పడేసింది. ఇలా సెప్టెంబరు వచ్చేసరికి దేశంలోని జైళ్లన్నీ నిండిపోయాయి. 'క్విట్ ఇండియా ఉద్యమాన్ని అణచివేసే క్రమంలో బ్రిటిష్ సైనికులు 50వేల మంది భారతీయులను కాల్చి చంపారని' సోషలిస్ట్ నాయకుడు రామ్‌మనోహర్ లోహియా అప్పటి వైస్రాయ్ లిన్‌లిత్‌గోకు లేఖ రాశారంటే అణచివేత ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇంతటి మహోజ్వల పోరాటం సత్ఫలితాన్నే ఇచ్చింది. తర్వాత అయిదేళ్లకు 1947లో కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతీకగా స్వతంత్ర భారత్ ఆవిర్భవించింది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బంగాళాఖాతంలో బలపడ్డ అల్పపీడనం

**తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు**
**మహబూబాబాద్‌లో పొంగుతున్న వాగులు**
**పలు జిల్లాల్లో వర్షాలకు పొంగిన వాగులు**
**శ్రీశైలం జలాశయం మూడు గేట్లు ఎత్తివేత**
**శ్రీరాంసాగర్ గగేట్లు ఎత్తి నీటి విడుదల**
**ములుగు జిల్లాలో ఇల్లు కూలి వృద్ధురాలు మృతి**



**విశాఖపట్నం/హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** బంగాళాఖాలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది మరింతగా బలపడి.. వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని అనుకొని కొనసాగుతోంది. ఇది ఉత్తర వాయువ్య దిశగా పయనిస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ ఒరిస్సా ఉత్తర కోస్తా జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. తూర్పు, పశ్చిమ గోదావరిలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణ, మిగతా ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల్లో కూడా చెదురుమొదురు వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ, పరీవాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరిగింది.ప్రస్తుతం జలాశయానికి 45వేల క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో వస్తున్నది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఏడుగేట్ల ఎత్తి 45వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ఇప్పటికే జలాశయం నిండుకుండను తలపిస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు నిండింది. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు, ప్రస్తుతం 1,088 అడుగుల మేర నీరున్నది. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా.. జలాశయంలో 77 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువనుంచి ప్రాజెక్టుకు 1,23,937 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 1,54,992 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 884.4 అడుగుల వద్ద నీరు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు. ఇప్పుడు 212.43 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. ఖమ్మం జిల్లాలోని పాలేరు ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తింది. ఎగువన భారీ వర్షాలకు జలాశయానికి 25 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నది. దీంతో అధికారులు 24 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లో వర్షాలతో పాలేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. ఆసిఫాబాద్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. నియోజకవర్గం వ్యాప్తంగా రాత్రి నుంచి ఆగకుండా వానపడుతున్నది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షానికి చింతలమానేపల్లి మండలంలోని దింద వాగు ఉప్పొంగింది. దీంతో దింద, రన్‌వెల్లి, నాయకపుగూడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జూరు మండలం సలుగుపల్లిలో తీగలఒర్రె వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. బెజ్జూరు, పెంచికలపేట మండలాల మధ్య వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు, రేపు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఒడిశా- పశ్చిమబెంగాల్ తీరంలో వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనంగా మారి ఉత్తరాంధ్ర తీరం వద్ద కేంద్రీకృతమైందని.. ఇది రాగల 48 గంటల్లో వాయుగుండంగా మారవచ్చని పేర్కొన్నది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. ఉత్తర తెలంగాణలోని 9 జిల్లాల్లో సోమవారం అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఈ జిల్లాల్లో రెడ్ అలర్ట్ కొనసాగుతుందని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో అత్యంత భారీ వర్షాలు పడొచ్చని తెలిపింది. నిజామాబాద్, సిరిసిల్ల, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుందని పేర్కొంది. ఎల్లో అలర్ట్ లో ఉన్న నల్గొండ, సూర్యాపేట, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. మహబూబాబాద్ లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహి స్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కుండపోత వర్షాలు.. రోడ్లన్నీ జలమయం కావడంతో జనజీవనం అస్తవ్యస్తం అయింది. కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామ శివారులో కత్తెర వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్కూల్ కు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల లోతు నీళ్లు వచ్చి వాగు దాటడం కష్టంగా ఉందంటున్నారు. అత్యవసర పనులకు వెళ్లే వారిని ట్రాక్టర్ సహాయంతో వాగు దాటిస్తున్నారు. ఇకపోతే ములుగుజిల్లాలో విషాదం చోటు చేసుకుంది. వర్షాలకు ఇల్లు కూలి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన మంగపేట మండలం కొత్త మల్లూరు(బెస్తగూడెం)లో చోటు చేసుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సోయం మంగమ్మ(60)కు చెందిన ఇల్లు ఆదివారం అర్ధరాత్రి కూలిపోయింది. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఉదయం గమనించిన స్థానికులు మంగమ్మ మృత దేహాన్ని బయటకు తీశారు. మంగమ్మకు ఓ కుమారుడు ఉండగా భద్రాద్రి కొత్తగూడెం లో ఉంటున్నాడు. రెవెన్యూ అధికారులు కూలిన ఇంటిని పరిశీలించి పంచనామా ప్రక్రియ నిర్వహించి, కలెక్టర్ కు నివేదించారు.

# కంచర్ల చూపు కాంగ్రెస్ వైపు

(మొదటి పేజీ తరువాయి..) బీజేపీ అభ్యర్థులుగా నల్లగొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు నుంచి రాజగోపాల్‌రెడ్డి పోటీ చేసే అవకాశం ఉంది.

**కంచర్ల భూపాల్‌రెడ్డిపై పీకే సర్వే ఎఫెక్ట్**

పీకే సర్వేలో నల్లగొండ సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై నెగటీవ్ రిపోర్టు కారణంగా వచ్చే సాధారణ ఎన్నికలలో నల్లగొండ టీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌ను గుత్త సుఖేందర్‌రెడ్డికి కెటాయించే అవకాశం లేకపోలేదు. దీనికి ప్రత్యమ్నాయ రాజకీయంలో భాగంగా కంచర్ల భవిష్యత్ కార్యచరణ మరోలా ఉండబోతుంది. ఇప్పటికే టీపీసీసీ రేవంత్‌తో కంచర్ల బ్రదర్స్ టచ్‌లో ఉన్నట్లుగా తెలుస్తుంది. టీఆర్ఎస్‌లో కంచర్ల బ్రదర్స్‌కు సాధారణ ఎన్నికలలో కేసీఆర్ మొండి చెయ్యి చూపితే కచ్చితంగా కాంగ్రెస్‌కు వెళ్లే అవకాశం ఉందని, ఇప్పటినుంచే అందుకు తగిన వ్యూహాలు చేస్తున్నట్లుగా సమాచారం.

**గుత్త సుఖేందర్‌రెడ్డికి కలిసివచ్చే అవకాశం మెండు**

రాబోయే సాధారణ ఎన్నికలలో గుత్త సుఖేందర్‌రెడ్డికి కలిసి వచ్చే అవకాశం ఉంది. నల్లగొండ టీఆర్ఎస్ అభ్యర్థిగా గుత్త సుఖేందర్‌రెడ్డికి, లేదా ఆ స్థానంలో మరొకరికి వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడొచ్చే ఎన్నికలలో టీఆర్ఎస్ పార్టీ నల్లగొండ అసెంబ్లీ స్థానాన్ని కొత్తవారికి కట్టబెట్టే అవకాశం ఉంది.

# వెంకయ్యనాయుడుతో పనిచేయడం అదృష్టం

(మొదటి పేజీ తరువాయి..)సభలో అనేక చారిత్రక ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. అయితే, దేశ ప్రజలకు వెంకయ్య నాయుడి అనుభవాల నుంచి నేర్చుకునే అవకాశం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు కార్యాదక్షత అందరికీ మార్గదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. సభకు ఇది అత్యంత భావోద్వేగ పరమైన క్షణం అని పేర్కొన్నారు. వెంకయ్య నాయుడు సమక్షంలో సభలో అనేక చారిత్రక ఘటనలు జరిగాయని గుర్తు చేసుకున్నారు. వెంకయ్య ప్రసంగంలో నవరసాలు ఉంటాయన్నారు. వెంకయ్య నాయుడు నాయకత్వ దక్షత వల్ల రాజ్యసభ పనితీరు మెరుగుపడిందని, ఉత్పాదకత గణనీయంగా పెరిగిందని గుర్తు చేశారు. వెంకయ్య హయాంలో దాదాపు 177 బిల్లులు పాస్ అయ్యాయని ప్రధాని తెలిపారు. మరెన్నో బిల్లులపై రాజ్యసభలో సామరస్యపూర్వక వాతావరణంలో విస్తృత చర్చ కూడా జరిగిందన్నారు. మాతృభాషల పరిరక్షణకు వెంకయ్య నాయుడు చేసిన కృషి ప్రశంసనీయమని మోడీ పేర్కొన్నారు. వెంకయ్య సుదీర్ఘ అనుభవం దేశానికి ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. రాజ్యసభ సక్రమంగా నడిచేందుకు వెంకయ్య నాయుడు ఇచ్చిన మార్గదర్శనం ఎంతో దోహదం చేసిందన్నారు. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడికి ధన్యవాదాలు. 'రాజకీయాల నుంచి విరామం తీసుకుంటున్నా. ప్రజా జీవితం నుంచి కాదు' అని మీరు చాలా సార్లు చెప్పారు. ఈ సభను నడిపించే బాధ్యత నుంచి మీరు ప్రస్తుతం వైదొలుగుతున్నారు. కానీ, దేశంతో పాటు ప్రజల కోసం పనిచేసే నాలాంటి వ్యక్తులకు మీ అనుభవాల నుంచి నేర్చుకొనే అవకాశం ఎప్పటికీ ఉంటుంది. వెంకయ్యనాయుడి దక్షత, పనివిధానం.. మనందరికీ మార్గదర్శనం అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వ్యక్తి పురోగతికి భాష, ప్రాంతం ఇవేమీ అడ్డంకులు కావు. ఎన్నో అడ్డంకులు దాటి వచ్చిన మీరు నేటి యువతకు ఆదర్శం. మాతృభాష-కంటిచూపు, పరభాష-కళ్లద్దాలన్న మీ మాట ప్రతిఒక్కరూ గుర్తుంచు కోవాలి' అని మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. దేశంలోని ప్రతి రాష్ట్రాన్ని చుట్టిన ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు సరికొత్త రికార్డు సృష్టించారు. ఐదేళ్ల పదవీకాలంలో ఆయన ప్రతి రాష్ట్రాన్ని, కేంద్రపాలిత ప్రాంతాన్ని చుట్టివచ్చారు. వెయ్యికిపైగా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలను సందర్శించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ ప్రాజెక్టులను ప్రారంభించారు. విభిన్న అంశాలపై పనిచేసే ప్రజలు, నిపుణులతో మమేకమయ్యారు. భాజపా అధ్యక్షుడిగా, కేంద్రమంత్రిగా పని చేసిన సమయంలో దేశమంతటా విస్తృతంగా పర్యటించిన అనుభవం ఉన్న ఆయన ఉపరాష్ట్రపతి హోదా లోనూ అదే ఒరవడి కొనసాగించారు. భారత్ మళ్లీ విశ్వగురు స్థానాన్ని అధిష్ఠించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. విద్యా వంతులు, నిపుణులు, విద్యార్థులు, రైతులు, పౌరసమాజ ప్రతినిధులతో సమావేశ మయ్యేందుకు ఉపరాష్ట్రపతి నివాస భవనంలో ఒక సమావేశ మందిరాన్ని నిర్మింపజేశారు. తన పనితీరును ప్రజల ముందుంచేందుకు 'మూవింగ్ ఆన్ మూవింగ్ ఫార్వర్డ్' పేరుతో ఏటా 'కాఫీ టేబుల్ బుక్'ను తీసుకొచ్చారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తిని ముందుతరాలకు చాటాలి

(మొదటి పేజీ తరువాయి..)కేసీఆర్ మాట్లాడుతూ... గాంధీనీ కించపరిచే సంఘటనలు ఇవాళ దేశంలో వినాల్సి వస్తుందన్నారు. భారతమాతకు సమానంగా గౌరవం ఇవ్వాల్సిన సందర్భంలో కొందరు చిల్లర మల్లర మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహాత్ముడు ఎప్పటికైనా మహాత్ముడే అని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటం గురించి కొత్త తరానికి తెలియదని... కొత్త తరాలకు స్వాతంత్ర్య పోరాటాలు తెలియాలన్నారు. పలువురి త్యాగాలు, పోరాటాలతో స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. పేదరికం ఉన్నంత కాలం అలజడులు ఉంటాయని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని కేసీఆర్ పేర్కొన్నారు. ఇదే సందర్భంలో మోదీ, బీజేపీ విధానాలపై కేసీఆర్ పరోక్షంగా చురకలు అంటించారు. నెగెటివ్ ఫోర్స్‌లను చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. చెలరేగుతున్న కూర్పును చెడగొట్టడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జాతిని చీల్చే వారిపట్ల అప్రమత్తమై ఉండాలని తెలిపారు. అవసరమైతే దేశం కోసం ముందుండి పోరాటం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. అనేక త్యాగాలు, పోరాటాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. గాంధీజీ ఎన్నో త్యాగాలు చేసి.. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఎన్నో దేశాల్లో స్వాతంత్ర్య పోరాటాలకు గాంధీజీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో నేతలు జీవితాలు త్యాగాలు చేశారని గుర్తు చేశారు. కొత్త తరం వారికి స్వాతంత్ర్య పోరాట సందర్భ ఘటనలు తెలియవని వ్యాఖ్యానించిన సీఎం కేసీఆర్... ఉద్యమకారులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం దారుణంగా అణచివేసిందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చాక ఈ దేశాన్ని కలిపి ఉంచేందుకు ఎంతో కష్టపడ్డారు. వందల మంది సంస్థానాల అధిపతులను ఒప్పించారు. రాజభరణాలు ఇచ్చారు. జమ్ముకశ్మీర్, జునాగఢ్, ఇండోర్, హైదరాబాద్.. దేశంలో విలీనమయ్యాయి. ఎన్నో వ్యయ ప్రయాసల తర్వాత పుదుచ్చేరి, గోవా, సిక్కిం కలిశాయి. పేదరికం ఉన్నంత కాలం దేశంలో అలజడులు, అశాంతి ఉంటాయి. దేశంలో పేదరికం పూర్తిగా తొలగిపోతేనే అభివృద్ధి సాధిస్తాం. ఈ దేశం నాదనే అభిప్రాయం ప్రతి ఒక్కరిలో కలగాలి. మహాత్ముడు ఎప్పుడూ మహాత్ముడే..: జాతిపిత గాంధీజీనీ కొందరు కించపరిచేలా ప్రవర్తిస్తున్నారు. మహాత్ముడు ఎప్పటికీ మహాత్ముడుగానే ఉంటాడు. మనం స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు ఎందరో ప్రాణత్యాగం చేశారు. తెలంగాణ వచ్చాక అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్రంలో శాంతిభద్రతలు పరిఢవిల్లుతున్నాయి. చిల్లర మల్లర చేష్టలను ప్రతి ఒక్కరూ చీల్చి చెండాడాలి. ఐకమత్యంతో ఉండి ఈ జాతి ఔన్నత్యం చాటాలని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్ని త్యాగాలు.. ఎన్ని పోరాటాలు.. ఆవేదనలతో స్వాతంత్ర్యం సిద్ధించింది.. ఆ స్ఫూర్తిని అందరికీ తెలిసేలా వాడవాడలా.. గ్రామగ్రామాన అద్భుతంగా స్వతంత్ర వజ్రోత్సవ వేడుకలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. 'భారత స్వాతంత్ర్యం కూడా సుదీర్ఘమైన పోరాటం. దాంట్లో ప్రధానంగా 1857 సిపాయిల తిరుగుబాటును తీసుకుంటాం. ఇక్కడ మనం చెప్పుకోవాల్సిన విశేషమేంటంటే.. సిపాయిలు తిరుగుబాటు రాజ్యం పడిపోవాలి. విప్లవపంథాలో విప్లవాలు చెలరేగి.. విప్లవ శక్తులు విజయం సాధించిన వేళకూడా రాజ్యానికి సహకరించే సగం మంది విప్లవకారులతో కలిసినప్పుడే విజయం సాధిస్తుంది. అట్లాగే సాయుధ బలగాలు పోరాటం, తిరుగుబాటు చేస్తే రాజ్యంపోవాలే. కానీ, భారత స్వతంత్ర సమరంలోని ఉజ్వలఘట్టం ఆ నాటి బ్రిటిష్ వలస రాజ్యం కూలిపోలే. ఆ తర్వాత బలంగా అణచివేత ప్రారంభించారు. అయినా స్వతంత్ర ఉద్యమకారులు సిపాయిల తిరుగుబాటు లాంటి అరూపఘట్టమే ఫెయిల్ అయ్యిందని ఎనాడూ నిరాశ చెందలే. అదే స్ఫూర్తితో వైఫల్యాన్ని పాఠంగా నేర్చుకొని పోరాటాన్ని కొనసాగించారు. బాలగంగాధర్ తిలక్ నేతృత్వంలో అనేక సాంస్కృతిక పోరాటాలు వచ్చాయ్. లాలాలజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్ ఇలా అనేక మంది పోరాటాలు చేశారు. ఝాన్సీ లక్ష్మీభాయి, ఎంతో మంది రాజులు, సంస్థానాదీశులు యావత్ ఆసేతుహిమాచలం ఒకటై పోరాటం జరిపారు' అని సీఎం కేసీఆర్ కొనియాడారు.. బారిష్టర్ చదువుకొని, చాలా సందించుకునే అవకాశాలుండి.. గొప్ప అడ్వకేట్‌గా పేరున్న మహాత్మా గాంధీ.. ఆయన స్వతంత్ర సమరానికి నాయకత్వం వహించి.. నడుం బిగించారు. దక్షిణాఫ్రికాలో ఎదుర్కొన్న జాతివివక్ష, అనేక వ్యవహారాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపి.. నాజాతి కూడా ఇదే పద్ధతిలో పోరాటం చేస్తుందని ఆయన భారత్‌కు రావడం జరిగింది. చాలా గొప్ప బిడ్డను కన్నది మన భరత మాత. భారతదేశ స్వతంత్ర సముపార్జన సారథే కాదు.. యావత్ ప్రపంచానికే అహింసా సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాంతిదూత, విశ్వమానవుడు మన మహాత్మాగాంధీ. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉండే కాలంలో.. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం జరిగిన సందర్భంలో ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబమా వచ్చారు. పార్లమెంట్ జాయింట్ సెషన్‌లో ప్రారంభించారు. ఉపన్యాసం ప్రారంభించే సమయంలో విలువైన మాట చెప్పారు. ఆ రోజు మన భారతీయులందరి గుండెలు పులకిపోయాయి. వ్యక్తిగతంగా నేను గర్వపడ్డాను. 'గాంధీ గారు ఈ ప్రపంచంలో పుట్టకపోయి ఉంటే.. ఒబమా అనే నేను అమెరికా అధ్యక్షుడిని అయ్యేవాడినే కాదు'? ఇది అమెరికా అధ్యక్షుడు చెప్పిన మాట. ఐన్‌స్టిన్ శాస్త్రవేత్త మహాత్మాగాంధీ అనే వ్యక్తి రక్తమాంసాలతో పుట్టి ఈ భూమిమీద నడయాడుతడు అనుకోలేదు.. అంతటి మహాత్ముడి అని ఐన్‌స్టిన్ చెప్పారు. ఆఫ్రికాలో ఎంతో పోరాటంచేసిన నెల్సన్ మండేలా.. నాకు ప్రముఖమైన స్ఫూర్తి ప్రధాత గాంధీ అని చెప్పారు. గాంధీ విశ్వమానవుడు.. ఆయనను కన్న గడ్డ నా భరత జాతి. అటువంటి జాతికి వారసులం మన అందరం' అని అన్నారు. మనం ఎంతో గర్వంగా, సంతోషంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మహాత్మాగాంధీ వారసులుగా ఈ దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి కంకణంకట్టుకున్న వ్యక్తులుగా మనం ప్రజాసేవరంగంలో మునిగి ఉన్నాం. మీ అందరికీ శ్రమ ఇచ్చి రాష్ట్రం నలుమూల నుంచి పిలిపించిన కారణం ఏంటంటే.. ఒక మహోజ్వల మైనటువంటి స్వతంత్ర వజ్రోత్సవ దీప్తి.. వాడవాడల గ్రామగ్రామాన చాలా అద్భుతంగా జరగాలి. చాలా గొప్పగా ఎన్ని త్యాగాలతో,ఎన్ని రకాల పోరాటాలతో, వేదనలు.. ఆవేదనలతో స్వాతంత్యం÷-ర వచ్చిందో ప్రతిగడపకు తెలిసేలా నిర్వహించాలి. జిల్లాలో మంత్రుల ఆధ్వర్యంలో కమిటీలు ఉన్నయ్. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీ అధ్యక్షులు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు అందరు తమ పరిధిలో ఉజ్వలం నిర్వహించాలని, ఆ స్ఫూర్తిని ఈ వేదికగా మీరు పొంది తిరిగి మీ మీ గ్రామాలు, పట్టణాల్లో అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు రప్పించాం అని మనవి చేస్తున్నా' అన్నారు. 'ఏయే సందర్భంలో ఎవరు త్యాగాలు చేశారు, ఎన్ని రకాల పోరాటాలు చేశారు.. అలవోకగా తమ అసువులు, ఆయుష్షును దేశ స్వాతంత్యం÷-ర కోసం ధారబోశారు.. మరణానికి వెనుకాడకుండా.. మడమ తిప్పకుండా పోరాటాలు చేశారు.. అలాంటి స్ఫూర్తి, త్యాగనీరతితో మనం ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది' అన్నారు. ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కళాకారులు ఈ వజ్రోత్సవాల్లో పాల్గొన్నారు. వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా హెచ్ఐసీసీలో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేదికపై 75 మంది కళాకారులతో నిర్వహించిన వీణావాయిద్య ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. శాండ్ ఆర్ట్‌తో స్వతంత్ర పోరాట ఘట్టాల ప్రదర్శన అందర్నీ భావోద్వేగానికి గురి చేసింది. వేదికపై దేశభక్తి ప్రబోధ నృత్యం, ఫ్యూజన్ డ్యాన్స్, లేజర్ షో అలరించాయి. వజ్రోత్సవాల్లో భాగంగా 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటా జాతీయ జెండా ఎగుర వేసేందుకు ప్రభుత్వం 1.2 కోట్ల జెండాలను పంపిణీ చేయనుంది. ఈ నెల 9 నుంచి 21 వరకు రాష్ట్రంలో 562 సినిమా హాళ్లలో ఉదయం పూట పాఠశాలల విద్యార్థుల కోసం రిచర్డ్ అటెన్‌బరో నిర్మించిన 'గాంధీ' చిత్రాన్ని ప్రదర్శిస్తారు. ఈ నెల 21న శాసనసభ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. 22న ఎల్బీ స్టేడియంలో ముగింపు వేడుకలు నిర్వహిస్తారు. వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 15 నుంచి పింఛనుకార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

# మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి..)రాజగోపాల్ రెడ్డి ఎట్టకేలకు తన రాజీనామాను శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డికి సమర్పించారు. మునుగోడు ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తున్నట్లు రాజగోపాల్ రెడ్డి సమర్పించిన లేఖను స్పీకర్ ఆమోదించారు. ఈ విషయాన్ని కోమటిరెడ్డి స్వయంగా వెల్లడించారు. ఎమ్మెల్యే పదవికి రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేశారు. స్పీకర్ ఫార్మాట్ లో రిజైన్ లెటర్ ఇచ్చారు. రాజగోపాల్ రాజీనామాకు స్పీకర్ ఆమోదం తెలిపారు.తన రాజీనామాను స్పీకర్ పోచారం ఆమోదించారని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. అంతకుముందు గన్‌పార్కుకు చేరుకున్న రాజగోపాల్‌రెడ్డి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ..మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ' కేసీఆర్ చుట్టూ తెలంగాణ ద్రోహులు ఉన్నారు. ఇచ్చిన ఏ హామీ సీఎం కేసీఆర్ అమలు చేయలేదు.ఎర్రబెల్లి, పువ్వాడ, గంగుల తెలంగాణ ఉద్యమకారులా?!. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కనీసం అపాయింట్ మెంట్ ఇవ్వరా?!. పదవి త్యాగం చేసేది మునుగోడు ప్రజలు, తెలంగాణ సమాజం కోసం. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారు. నా రాజీనామా ప్రస్తావన తర్వాతే గట్టుప్పల్ మండలం ప్రకటించారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎవరు చెప్పారు.మునుగోడు ప్రజలు ఇచ్చే తీర్పు సీఎంకు కనువిప్పు కలిగించాలి. తలసాని తెలంగాణ ఉద్యమకారులపై కేసులు పెట్టించలేదా?. నేను చేసేది త్యాగం.. గెలుపోటములు ప్రజలు నిర్ణయిస్తారు. మునుగోడుతో పాటు చాలా నియోజకవర్గాల్లో సమస్యలు ఉన్నాయి. మూడున్నరేళ్లుగా నియోజకవర్గానికి నిధులు ఇవ్వక పోవటం తోనే మునుగోడు అభివృద్ధి ఆగిపోయిందని రాజగోపాల్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మూడున్నరేళ్లుగా నియోజకవర్గానికి నిధులు ఇవ్వకపోవటంతోనే మునుగోడు అభివృద్ధి ఆగిపోయిందని రాజగోపాల్ రెడ్డి అన్నారు. అరాచక, కుటుంబ పాలనకు వ్యతిరేకంగా తన రాజీనామా అంశం ముందుకు వచ్చిందన్నారు. కేసీఆర్ చేతిలో చిక్కిన తెలంగాణ తల్లిని కాపాడుకోవాలని అన్నారు. మునుగోడు అభివృద్ధి కోసమే తన రాజీనామా అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని... రాజీనామా అనగానే గట్టుప్పల్ మండలం అయ్యిందన్నారు. సీఎంకు సిరిసిల్ల, సిద్ధిపేట, గజ్వేల్ తప్ప ఇంకే కనిపించడం లేదని మండిపడ్డారు. టీఆర్ఎస్ తెలంగాణ ద్రోహుల పార్టీగా మారిందని విమర్శించారు. ఉప ఎన్నిక వచ్చాక మునుగోడు గుర్తొచ్చిందన్నారు. యుద్ధంలో మునుగోడు ప్రజలు గెలుస్తారని తెలిపారు. టీపీసీసీ చీఫ్ భాష విని సమాజం తలదించుకుందని, జైలుకెళ్లిన వ్యక్తులు మాట్లాడితే ప్రజలు నమ్మరని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఇదిలావుంటే కోమటిరెడ్డి రాజీనామాను స్పీకర్ ఆమోదించారు. అనంతరం గవర్నర్ తమిళిసైని కలిసేందుకు రాజగోపాల్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరారు. 2018 డిసెంబర్‌లో మునుగోడు ఎమ్మెల్యే గా కోమటిరెడ్డి గెలుపొందిన విషయం తెలిసిందే.

## రాజస్థాన్ దేవాలయంలో తొక్కిసలాట

ముగ్గురు మహిళల మృతి..ఇద్దరికి గాయాలు

సంతాపం తెలిపిన ప్రధాని మోడీ, సిఎం గెహ్లోట్

**జయపుర, ఆగస్ట్ 8 (సమ సమాజం):** రాజస్థాన్‌లోని ఓ దేవాలయంలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు మరణించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రాజస్థాన్ శికర్ జిల్లాలోని ఖతు శ్యామ్‌జీ దేవాలయం లో నెలకొకసారి జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఎప్పటిలాగే భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. తెల్లవారకముందే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం ఐదు గంటలకు దర్శనం మొదలు కాగా... ఈ సందర్భంలోనే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగనట్టు తెలుస్తోంది. దీంతో చాలా మంది భక్తులు కింద పడిపోయారు. ఒకరినొకరు తోసుకుంటూ, తొక్కుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు అక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని జైపూర్ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో వైద్యం అవసరమైన వారికి స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. అంతే కాకుండా మృతి చెందిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు, గాయపడ్డ వారికి రూ.20,000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# కాంగ్రెస్ నుంచి కర్ణుడు వెళ్ళిపోయాడు

ఇక పంచపాండవులు మిగిలారు: జీవన్ రెడ్డి వ్యాఖ్య



**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** తెలంగాణ కాంగ్రెస్‌లో పంచపాండవులు మిగిలారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కర్ణుడు బయటకు వెళ్లిపోయాడని చెప్పారు. మునుగోడులో గెలిచేది తామేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజగోపాల్ రెడ్డికి అసెంబ్లీతో బంధం తెగిపోయిందన్నారు. రాజీనామాతో నియోజకవర్గంలో టీఆర్ఎస్‌కి బలం పెంచుకునే అవకాశం ఇచ్చినట్లయిందని చెప్పారు. రాజీనామాతో అభివృద్ధి అనేది సరైన వ్యూహం కాదని తెలిపారు. మూడేండ్లుగా రాజగోపాల్‌రెడ్డి చేసిన ఉద్యమేంటని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఉద్యమం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ వద్దని చెప్పిందా అని నిలదీశారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే రాజీనామా చేయడమంటే చేతకానితనమని విమర్శించారు. రాజగోపాల్‌రెడ్డి రాజీనామాను ప్రజలు ఎలా చూస్తారనేది చూడాలన్నారు. కాగా, మునుగోడులో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే.. అధికారంలోకి వచ్చినట్లేనని చెప్పారు. బరిలో నిలిచే అభ్యర్థిని పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు. అయితే రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో టీకాంగ్రెస్‌లో పంచపాండవులు మిగిలారని వెల్లడించారు. సీఎల్పీనేత భట్టివిక్రమార్క.. ధర్మరాజు అయితే, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిని భీముడని, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబును అర్జునుడిగా అభివర్ణించారు. రాజగోపాల్ రెడ్డిని కర్ణుడితో పోల్చారు.

# అట్టహాసంగా స్వతంత్ర భారత వజ్రోత్సవాలు

జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరంచిన కెసిఆర్

ఆకట్టుకున్న వీణావాయిద్య ప్రదర్శన



**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** స్వతంత్ర భారత వజ్రోత్సవాలు తెలంగాణలో అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. పక్షం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వ హించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. హెచ్ఐసీసీలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి.. జాతిపిత గాంధీజీ, భరతమాత విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం 75 మంది వీణ కళాకారులచే వీణా వాయిద్య ప్రదర్శన చేపట్టగా.. సీఎం కేసీఆర్ వీక్షించారు. ఆ తర్వాత సాండ్ ఆర్ట్ ప్రదర్శన, దేశభక్తి ప్రబోధ నృత్యరూపకం, ఫ్యూజన్ ప్రదర్శన, లేజర్ షో జరిగాయి.. స్వతంత్ర భారత వజ్రోత్సవాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లాల నుంచి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు హెచ్ఐసీసీకి తరలివచ్చారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్, ఎంపీ కే కేశవరావు, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్ లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా దేశ భక్తి ఉట్టిపడేలా, అత్యంత ఘనంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. భారత స్వతంత్ర వజ్రోత్సవాల స్ఫూర్తిని చాటేలా కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవంలో 75 మంది వీణ కళాకారులతో వాయిద్య ప్రదర్శన చేశారు. హైదరాబాద్‌లోని అన్ని జంక్షన్లు, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

# నీతి ఆయోగ్ భేటీతో ఒరిగేదేమీ లేదు

నాగేశ్వర్ రావు ట్వీట్‌కు కెటిఆర్ రీట్వీట్



**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రధానిని ప్రశ్నించాల్సి ఉండాల్సిందని మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ రావు చేసిన ట్వీట్‌పై మంత్రి కేటీఆర్ స్పందించారు. అయినను పోయి రావలె హస్తినకు అనేది పాత సామెత అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ కేంద్ర ప్రభుత్వం ఒక పక్షపాత, వివక్ష పూరితమైన మనస్తత్వంతో గతంలో నీతి ఆయోగ్ సిఫార్సులను బుట్టదాఖలు చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో నీతి ఆయోగ్‌లో నీతి కూడా అంతే ఉందన్నారు కేటీఆర్. అందుకే సీఎం కేసీఆర్ నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారని కేటీఆర్ స్పష్టం చేశారు. హాభారతంలో సంధి కుదరదని తెలిసి కూడా శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్లిన ఘటన నుంచి కేసీఆర్ జ్ఞానం పొంది ఉండాలి. ప్రధాని, ముఖ్యమంత్రులు హాజరయ్యే నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం హాజరై ప్రశ్నించి ఉండాల్సిందని నాగేశ్వర్ రావు పేర్కొన్నారు.

## రాజీనామాకు ఇద్దరం సిద్ధమవుదామా.? కౌన్సిలర్ చిట్టిబాబు



**టేక్మాల్, ఆగస్టు 08 (సమ సమాజం):** గత మూడు రోజులుగా ఆందోల్-జోగిపేట మున్సిపల్ కాంగ్రెస్ తెరాస ప్రజా ప్రతినిధులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. పరువు ఆరోపణల పట్ల మున్సిపల్ పట్టణ ప్రధారికం తలలు పట్టుకుంటూ అయోమయానికి గురవుతున్న పరిస్థితి నెలకొంది. సోమవారం జోగిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హస్తం నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) మాట్లాడుతూ. నా ఇంటి నిర్మాణ విషయంలో కలెక్టర్ ని కలవడం తప్పా.? అనుమతుల కోసం వెళ్లాను కానీ అక్రమ దారిలో వెళ్లలేదన్నారు. ఈ విషయానికొస్తే 20వ వార్డు కౌన్సిలర్ చందర్ నాయక్ నిర్మించిన నూతన భవనానికి అనుమతులు ఎంత మేరకున్నాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు నిర్మిస్తే ఉపన్యాయం తెరాస నాయకులు నిర్మిస్తే మరో న్యాయమా అని ఈసందర్భంగా ఆయన ప్రశ్నించారు. నేను బ్లాక్ మెయిల్ అని నిరూపిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని చైర్మన్ కి ప్రతి సవాల్ విసిరారు. చిట్టిబాబు అంటే బ్లాక్ మెయిలర్ కాదు ఒక సేవకుడని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మా కాంగ్రెస్ అభ్యర్థి పై తక్కువ ఓట్లతో గెలిచిన నీకే ఇంత ఉంటే ప్రజల ప్రేమాభిమానాలతో గెలిచిన నాకెంత ఉండాలి చైర్మన్ గారు. వయసును మించిన మాటలు మాట్లాడాలి తప్ప లేనిపోని మాటలు మాట్లాడకూడదని ఈ సందర్భంగా కోరుతున్నా అన్నారు. ఇద్దరం రాజీనామా చేద్దాం ప్రజాక్షేత్రంలోకి వెళాం ప్రజలు ఎవరికి పట్ట కడతారో చూద్దాం అంటూ బాణం విడిచారు.

## మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి



**మెదక్, ఆగస్టు 08 (సమ సమాజం):** మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో సమస్యలు పరిష్కరించాలి, ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా అదనపు ప్రతిమాసింగ్. మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులు స్వీకరించి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఈ విషయంలో ఏమాత్రం జాప్యం చేయరాదని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 22 ఫిర్యాదులు రాగా అందులో 17 రెవెన్యూ సంబంధితమైనవి, మరో ఐదు ఇతర సమస్యలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ మేరకు ఆయా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జోగిపేటలో ఘనంగా సాయన్న జయంతి వేడుకలు



**ఆందోల్, ఆగస్టు 08 (సమ సమాజం):** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ముదిరాజ్ జాతి రత్నం పండుగ సాయన్న 132 వ జయంతి సందర్భంగా సోమవారం జోగిపేట లో బహుజన నాయకులు సాయన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి జయంతిని గణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు డి. బి. నాగభూషణం, చాపల వెంకటేశం, పొట్టిగల్ల మోహన్ లుమాట్లాడుతూ. నిజాం నిరంకుశత్వంకు వ్యతిరేకంగా పోరాడినయోధుడు పండుగ సాయన్న నిజాం దోపిడి అరాచాకాలనుఅడ్డుకొని నిరుపేద నిస్సహాయ ప్రజలకు అండగా నిలిచారుప్రతి పేదవాడు కడుపు నిండ భువ్వ తినాలని, అందరు సంతోషంగా ఉండాలని భూస్వామ్య గుండాలను ఎదుర్కొని పేద ప్రజానీకానికి ప్రత్యేకంగా మహిళలకు రక్షణ గానిలిచాడన్నారు. ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలని కలలుగన్న పండుగ సాయన్న ముదిరాజ్ అశయాలను కొనసాగిద్దాం అని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో బహుజన నాయకులు లింగం, ప్రసాద్ ముదిరాజ్, అరిగే ప్రకాష్ ముదిరాజ్, బరుడి లక్ష్మణ్ ముదిరాజ్, నార్సింగి సాయిబాబా ముదిరాజ్, రొడ్డ కిష్టయ్య, కుక్కల భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోడురైతు సెల్ఫీ వీడియోపై షర్మిల స్పందన

ప్రభుత్వ దమనకాండపై మండిపాటు

పోడు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్



**హైదరాబాద్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** తమ భూమిని అధికారులు గుంజుకుంటున్నరని ఆరోపిస్తూ ఓ పోడు రైతు సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై తెలంగాణ వెస్సార్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల స్పందించారు. ఈ రైతు సెల్ఫీ వీడియో టీఆర్ఎస్ దౌర్భాగ్య పాలనకు నిదర్శనమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాతల తండ్రుల నుంచి పోడు చేసుకొంటున్న భూములను లాక్కొంటే, దొర పాలనలో మాకు బతుకు లేదని సెల్ఫీ వీడియో తీసుకొని మరీ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మొన్న ఆదివాసీ మహిళలను, పసిపిల్లల తల్లులను జైల్లో పెట్టించావ్... ఇవాళ రైతుల భూములు లాక్కొని చచ్చేలా చేస్తున్నావ్... అంటూ షర్మిల మండిపడ్డారు. వందల మంది విద్యార్థులు చస్తే కానీ నీకు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలనే సోయి రాలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఎంతమంది ఆదివాసీలను చంపితే నీకు పోడు భూములకు పట్టాలివ్వాలని సోయి వస్తుంది? అంటూ రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బంగారు తెలంగాణలో బతకడమే పాపమన్నట్టు చేశావ్... ఆత్మహత్యలే దిక్కు అనేటట్టు చేశావని వైఎస్ షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. తాతల కాలం నుంచి సాగు చేస్తున్న భూమిని ఫారెస్ట్ ఆఫీసర్లు గుంజుకుంటున్నరని మనస్తాపానికి గురైన పోడు రైతు సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం దేవులపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన జింక శ్రీశైలం తన తాతల కాలం నుంచి వచ్చిన నాలుగెకరాల పరంపోగు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఫారెస్ట్ ఆఫీసర్లు, గ్రామ సర్పంచ్ ప్రమీల భర్త సత్తయ్య వెళ్లి శ్రీశైలం వేసిన మిరప పంటను జేసీబీతో తొలగించారు. పంటను ఎందుకు తొలగిస్తున్నారని శ్రీశైలం అడిగితే.. ఇది మీ భూమి కాదు. దీనిని ప్రకృతి వనం కోసం కేటాయించాం అని చెప్పారు. తమ భూమి తీసుకోవద్దని బతిమలాడితే.. న్యాయం చేయాల్సిన సర్పంచ్ తమ సంగతి చూస్తానని బెదిరించాడని శ్రీశైలం తెలిపాడు.

## అధ్యాపక బృందం నిర్లక్ష్యం పట్ల అధికారులు సీరియస్



**మునిపల్లి, ఆగస్టు08 (సమ సమాజం):** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధి మునిపల్లి మండలం బుదేర లో గల ప్రభుత్వ సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు వైద్యాధికారులు కరోనా పరీక్షలు నిర్వహించి 16 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్ గా నిర్ధారించారు. ఈ కళాశాలలో 230 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బందితో పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ డిగ్రీ కళాశాల పక్కనే కాస్త దూరంలో గుడి వుండటంతో విద్యార్థులు గుడికి కూడా వెళుతూ వుంటారు అలాగే జూనియర్ కళాశాల వుండటం వల్ల ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం వుంది. ఇంత జరుగుతున్న కళాశాల నిర్వహకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వుండటం కొసమెరుపు. విషయం తెలుసుకున్న మండల ఎమ్మార్వో, ఎంపీడీవోలు సోమవారం కళాశాలను తనిఖీ చేశారు. వైరస్ సోకిన విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. మండల వైద్య అధికారి శిరీష ఆధ్వర్యంలో మేదికేశన్ కోర్స్ ఇవ్వడం జరిగింది. వంటశాల అశుభ్రంగా వుండటం కుళ్ళిన కూరగాయలు దర్శనం ఇవ్వడంతో కళాశాల అధ్యాపక బృందంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అంగన్వాడి కేంద్రంగా మారిన సొంత ఇల్లు

బొల్లి కుంట తండాలో కానరాని అంగనవాడి కేంద్రం

అంగన్వాడీ కేంద్రానికి వచ్చే సరకులన్ని (హం"పట్)!

టీచర్ ని మార్చాలని తండావాసుల ఆవేదన!



**టేక్మాల్, ఆగస్టు 08 (సమ సమాజం):** తల్లి గర్భం దాల్చిన నాటి నుండి శిశువు జన్మించిన నాటి వరకు తల్లి బిడ్డల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తమ రికార్డులో నమోదు చేసుకొని శిశువు ఎదుగుదలకు బాలామృతం లాంటి పోషక పదార్థాలు పెట్టి శిశువు జననాంతరం ఐదు సంవత్సరాల వరకు అంగన్వాడీలో కిశోర బాల బాలికలను విద్యపై దృష్టి మళ్లించే ఏకైక తొలి దశ గురువు అంగన్వాడీ టీచర్, అలాంటి టీచర్ నెలలో ఒక్కసారి వచ్చి తండా వాసుల కు పోషక పదార్థాలు ఇవ్వని దుస్థితి మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలోని బొల్లికుంట తండాలో మినీ అంగన్వాడీ కేంద్రంలో చోటుచేసుకుంది. సొంత ఇంట్లోనే అంగన్వాడి కేంద్రం తాండ వాసులు తెలిపిన వివరాల ప్రకారం బొల్లి కుంట తండాలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తుంటారని వారిలో సుమారు 15 నుండి 20 మంది కిషోర బాలబాలికలు, పదిమందికి పైగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ఉంటారని, కిషోర బాలబాలికలకు ప్రతిరోజు గుడ్లు, పాలు, పౌష్టికాహారం, బాలామృతం, అందించాల్సిన అంగన్వాడీ టీచర్ అందుబాటులో లేకపోవడం, అలాగే అంగన్వాడి కేంద్రం తమ సొంత ఇంట్లోనే పెట్టుకొని అద్దె కిరాయితో సహా పలు నిత్యవసర సరుకులు వాడుకుంటుందని తెలిపారు. అలాగే గర్భిణీ స్త్రీలకు గర్భం దాల్చిన నాటి నుండి వారి బాగోవుల నిమిత్తం రికార్డులో నమోదు చేసుకొని ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రతినెల ఇంజక్షన్స్ ఇప్పించాల్సి ఉండగా ప్రస్తుతం ఇక్కడ అంగన్వాడీ టీచర్ హైదరాబాదులో ఉంటూ తాండావాసులకు అందుబాటులో లేకపోవడంతో గర్భిణీ స్త్రీలు ప్రైవేటు దావఖానలను ఆశ్రయించడం జరుగుతుందని ఏదేమైనాప్పటికీ అంగన్వాడీ టీచర్ ప్రతిరోజు తండాలో అందుబాటులో ఉండాలని లేని పక్షంలో ఆమె స్థానంలో వేరే వారిని కేటాయించాలని ఉన్నత స్థాయి అధికారులకు బొల్లి కుంట తండావాసులు వేడుకున్నారు.

## ఆజాది కా అమృత్ మహొత్సవం75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలు

ప్రారంభించిన చల్వాయి గ్రామ ఉప సర్పంచ్ తేళ్ల హరిప్రసాద్



**ములుగు, 08 సోమవారం (సమ సమాజం):** గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామంలో గల ఉన్నత పాఠశాల తరగతి గదులను రంగు రంగుల కాగితాలతో పూలతో మామిడి తోరణాలతో దేశ నాయకుల చిత్రపటాలను పూల మాలలతో అలంకరించనైనది కొబ్బరి ఆకులు అరటి బోదెలతో మామిడి ఆకులతో పూలతో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం వజ్రోత్సవ వేడుకలకు మరింత శోభను సంతరించి పాఠశాలలో పండుగ వాతావరణం ఏర్పడి విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని కలిగించింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుంజ రాజేశ్వర్ రావు మోలుగూరి రమేష్ ఉప్పుతల ప్రసాద్ దామరాజు సమ్మయ్య చల్లగురుగుల మల్లయ్య బూత్కురి శ్యామ్ సుందర్ రెడ్డి అంద రమాదేవి శ్రీరాముల శ్రీనివాసరావు భూక్య సరిత సుతారి మురళీధర్ వెంకటరమణమూర్తి పూసం శ్రీదేవి రాయబారపు దీప్తి వెంకటేష్ పాల్గొన్నారు

# ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగతాం

దేశ నిర్మాణంలో పార్టీ పాత్రను నేటి తరాలకు గుర్తుచేస్తా మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**కరీంనగర్, ఆగస్ట్ 8 (సమ సమాజం):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఈ నెల 9వ తేదీ నుంచి 18వరకు పది రోజుల పాటు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీజేపీ తెలంగాణకు వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. దేశ 75వ స్వాతంత్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ త్యాగం, ఈ దేశ నిర్మాణంలో పార్టీ పాత్రను ఇప్పటి తరాలకు గుర్తు చేసేందుకు ఈ పాదయాత్ర చేస్తున్నామన్నారు. దేశ మొదటి ప్రధాని నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్ సింగ్ దేశ పురోగతికి ఎంతో చేశారని వెల్లడించారు. వీరిని మరచిపోయే విధంగా బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. ఎంపీ బండి సంజయ్ అభివృద్ధిని మరచి భాగ్యలక్ష్మి టెంపుల్‌కే పరిమితమయ్యాడని, కేసీఆర్‌ను జైల్లో పెడతామనడం తప్ప చేసిందేమి లేదని విమర్శించారు. 108 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయిన బీజేపీ తాము గొప్ప అని చెప్పడానికి ఉప ఎన్నికలు తెస్తుందన్నారు. దీని వల్ల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇంకా అనేక ఉప ఎన్నికలు వస్తాయనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు ముఖాముఖీగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేటలో మొదలై హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి వరకు 125 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందని తెలిపారు. దీనిని ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వా మ్య పరిరక్షణ, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. 75ఏళ్ల స్వాతంత్ర భారత దేశంలో గత ప్రభుత్వాల అభివృద్ధిని మరల్చాలని ప్రధానమంత్రి ప్రయత్నిస్తున్నారని దాన్ని కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. పాదయాత్రలో భాగంగా ముంపుగ్రామాల సమస్యలు, అదనపు టీఎంసీ నీటి కోసం, కొండగట్టు, వేములవాడ దేవస్థానాల అభివృద్ధి, సిరిసిల్ల టెక్స్టైల్స్, తదితర అనేక సమస్యలు, అమలుకాని హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తద్వారా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు వచ్చే ఎన్నికల్లో లోక్‌సభ నుంచి స్థానిక సంస్థల వరకు గెలుపే లక్ష్యంగా పాదయాత్ర సాగుతుందని కాం గ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. 9రోజుల పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 140కి.మీ మేర పాదయాత్ర ఉంటుందన్నారు. టీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని అమిత్‌షా, సీఎం కేసీఆర్ ఒక్కటేనని ఢీల్లీలో దోస్తీ చేస్తూ రాష్ట్రంలో కొట్లాడుకుంటున్నట్లు ప్రజల దృష్టి మర ల్చడానకి ఎత్తులు వేస్తున్నాయని ప్రభాకర్ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఉప ఎన్నికలపై ఉన్న యావ కేంద్రం నుంచి అభివృద్ధికి ప్రత్యేక నిధులు, రాష్ట్ర విభజన హామీలు అమలుపై లేదని విమర్శించారు. బండి సంజయ్ ఓ జోకర్‌లా తెలంగాణలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని పదేపదే ఆరోపించడమే తప్ప ఈడీకి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. దేశంలో బీజేపీని వ్యతిరే కించే అనేక మందిని ఈడీ ద్వారా దాడులు చేయించారని అన్నారు. వారికి ఉమ్మడి శత్రువుగా కాంగ్రెస్ పార్టీని బలహీనపరచాలనే కుట్రలో భాగంగా రాష్ట్రంలో డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. నిత్యావసర వస్తువులపై ఉన్న ధలను రెట్టింపు చేసి సామాన్యుడి నడ్డి విరిచేలా చర్యలు చేపడుతున్న బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలను రానున్న ఎన్నికల్లో ప్రజలు గద్దెదించాలని పొన్నం పిలుపునిచ్చారు. నిత్యావసర సరుకులతో పాటు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను రెట్టింపుచేసిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరును దుయ్యబట్టారు. వ్యతిరేకించారు. ఈ ఎనిమిదేళ్ల కాలంలో అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను, డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను రెట్టింపు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. చైనా తయారు చేసిన జెండాల ను నిషేధించాలని స్వదేశీ జాతీయ జెండాలను ఎగుర వేసేలా కాంగ్రెస్ నాయకులు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు.





# చలన చిత్రం



## వరుస సనిమాలతో బిజీగా కన్నడ బ్యూటీ

మాచర్ల నియోజకవర్గంతో వస్తోన్న కృతిశెట్టి

ఉప్పెన' చిత్రంతో టాలీవుడ్‌లో కథానాయికగా అడుగుపెట్టింది తుళు బ్యూటీ కృతి శెట్టి. తొలి చిత్రంతోనే సెన్సేషన్ క్రియేట్ చేయడంతో.. ఆమెకు ఎనలేని క్రేజ్ వచ్చి పడింది. ఆ సక్సెస్ క్రెడిట్‌తోనే వరుస అవకాశాలు అమ్మడిని వరించాయి. చూపు తిప్పకోలేని అందం, చూడ ముచ్చటైన అభినయం కృతిశెట్టి ప్రత్యేకత. ఆ కారణంగానే కృతి వరుసగా 'శ్యామ్ సింగరాయ్ , బంగార్రాజు ' చిత్రాల్లో కథానాయికగా ఆఫర్స్ అందుకుంది. ఈ రెండూ బ్లాక్ బస్టర్ హిట్స్ అవడంతో హ్యాట్రిక్ హీరోయిన్ అయిపోయింది. రీసెంట్‌గా వచ్చిన రామ్ పోతినేని 'ది వారియర్' చిత్రం నిరాశ పరిచినప్పటికీ.. ఆమె వరుసగా బడా ప్రాజెక్ట్సులో నటిస్తూ బిజీ అయిపోయింది. వాటితో పాటు పారితోషికాన్ని కూడా భారీగా పెంచేసింది. ప్రస్తుతం కృతి శెట్టికి బాలీవుడ్ నుంచి చాలా ఆఫర్స్ వస్తున్నాయి. రీసెంట్‌గా కృతి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బాలీవుడ్ నుంచి చాలా ఆఫర్స్ వస్తున్నాయని, అయినప్పటికీ తెలుగులో బిజీగా ఉండడంతో అక్కడ సినిమాలు చేయలేకపోతున్నానని తెలిపింది. ప్రస్తుతం తమిళంలో సూర్య సరసన కథానాయికగా ఒక సినిమాలో నటిస్తోంది. నితిన్ 'మాచర్ల నియోజకవర్గం' లో ఆమె కథానాయికగా నటిస్తోంది. ఈ నెల 12న భారీ ఎత్తున విడుదల కానుంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్రమోషనల్ ఇంటరాక్షన్‌లో కృతి శెట్టి ఆ విషయాన్ని వెల్లడించింది. బాలీవుడ్ నుంచి మంచి మంచి ఆఫర్స్ వస్తున్నప్పటికీ, తెలుగులో బిజీ అయిన కారణంగానూ, డేట్స్ సర్దుబాటు అవకపోవడం వల్లనూ తాను బాలీవుడ్ ఆఫర్స్‌ను పక్కన పెట్టాల్సి వస్తోందని అంటోంది కృతి. తమిళంలో సూర్య చిత్రంతో పాటు తెలుగులో మరో మూడు ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నట్టు తెలిపింది. ఈ మూడు సినిమాలపై త్వరలోనే క్లారిటీ రానుంది. మరి ఫ్యూచర్‌లో అయినా కృతి శెట్టి బాలీవుడ్ సినిమాల్లో నటిస్తుందో లేదో చూడాలి.



## శ్రీదేవి సినిమాల రీమేక్ అమ్మో వాటి జోలికి వెళ్లనన్న జాన్వీ

సినిమా అంశాలు, గ్లామరస్ ఫొటోలు పోస్ట్ చేస్తూ జాన్వీ కపూర్ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్‌లో రంగప్రవేశం చేసిన జాన్వీ కపూర్, తడక్‌తో హీరోయిన్‌గా పరిచయం అయ్యింది. తొలి ప్రయత్నంలోనే నటిగా ప్రశంసలు అందుకుంది. కానీ ఆ తర్వాత ఆమె నటించిన చిత్రాలు ఆశించినంత సక్సెస్ కాలేదు. తమిళంలో నయనతార నటించిన హీరోయిన్ కోలవవు కోకిల చిత్రాన్ని జాన్వీ కపూర్ హిందీలో రీమేక్ చేశారు. గుడ్ లక్ జెర్రీ పేరుతో రపొందిన ఈ చిత్రం ఓటీటీలో విడుదలైంది. అయితే ఈ సినిమా ఓటీటీలో విడుదలైనా, థియేటర్లలో విడుదల కాలేదన్న బాధ ఈ అమ్మడికి ఉందట. ఇక రీసెంట్ ఇంటర్వ్యూలో తల్లి శ్రీదేవి చేసిన సినిమాలను రీమేక్ చేస్తారా అని ప్రశ్నించగా అంతటి సాహసం చేయలేనని పేర్కొంది. తన తల్లి ప్రతి సినిమాలో తనకంటూ స్పెషల్ ఇమేజ్‌ను క్రియేట్ చేసుకుందని తెలిపింది. ఇక దక్షిణాది సినిమాల్లో నటించడానికి తాను వెయిటింగ్ అని, మంచి ఆఫర్స్ వస్తే అసలు వదులకోనను చెప్పింది



## తారా జువ్వలా దూసుకొచ్చిన రష్మిక

తక్కువ సమయంలో అనేక సినిమాలతో టాప్ స్టేటస్

సినీరంగంలో హీరోయిన్లకు గుర్తింపు రావడానికి చాలా సమయమే పడుతుంది. అదే కొందరు ఒకటీ రెండు సినిమాలతోనే స్టార్ స్టేటస్‌ను సంపాదించుకుంటారు. అలా ఓవర్ నైట్ స్టార్ అయిన కథానాయిక రష్మిక మందన్న. కన్నడలో 'కిరిక్ పార్టీ' సినిమాతో సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ప్రస్తుతం సౌత్ టూ నార్త్ వరకు స్టార్ హీరోలందరితో కలిసి నటిస్తుంది. రష్మిక క్రేజ్ టైర్2 హీరోలకు ఏమాత్రం తగ్గకుండా ఉంది. ప్రస్తుతం ఈమె చేతిలో ఐదు సినిమాలున్నాయి. అందులో రెండు షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉండగా మరో మూడు షూటింగ్ దశలో ఉన్నాయి. ఇదిలా ఉంటే తాజాగా రష్మిక మరో సినిమాకు సైన్ చేసినట్లు తెలుస్తుంది. నాగచైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం ఈయన 'ధూత' అనే హార్రర్ వెబ్ సిరీస్‌ను చేస్తున్నాడు. దీని తర్వాత వెంకట్ ప్రభు దర్శకత్వంలో ద్విభాష చిత్రాన్ని చేస్తున్నాడు. త్వరలోనే ఈ చిత్ర షూటింగ్ ప్రారంభంకానుంది. ఇవి సెట్స్‌పైన ఉండగానే పరుశు రామ్ పెట్లతో సినిమా చేయడానికి ఇటీవలే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటుంది. కాగా ఈ చిత్రంలో నాగచైతన్యకు జోడీగా రష్మికను మేకర్స్ సంప్రదించారట. కథ నచ్చడంతో రష్మిక కూడా వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. త్వరలోనే దీనిపై అధికారకంగా ప్రకటన రానుంది. రష్మిక చేతిలో ప్రస్తుతం ఐదు సినిమాలున్నాయి. అందులో 'గుడ్‌బై', 'మిషన్ మజ్నూ' షూటింగ్‌లను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇక తెలుగులో 'పుష్ప' సీక్వెల్ చేస్తుంది. దీనితో పాటుగా విజయ్ ద్విభాషా చిత్రం 'వారసుడు'లో నటిస్తుంది.త



## గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో విజయ్ తాజా సినిమా

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ ప్రస్తుతం వరీసు మూవీతో బీజీగా ఉన్నాడు. ఈ మూవీ తర్వాత 'విక్రమ్' డైరెక్టర్ లోకేశ్ కనకరాజుతో ఓ సినిమా చేయనున్నాడు. విజయ్-లోకేశ్ కనకరాజ్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన మాస్టర్ చిత్రం ఎంతటి విజయం సాధించిందో ప్రత్యేకంగా చెపన్నక్లేదు. దీంతో వీరిద్దరు కాంబో వచ్చే ఈ చిత్రంలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించినప్పుటి నుంచి ఈ మూవీ కథేంటి, ఈసారి ఏ థీమ్‌తో రాబోతున్నారనేది ఫ్యాన్స్‌లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ సంబంధించి ఓ క్రేజీ అప్‌డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ సినిమా కథ ఇదేనంటూ సోషల్ మీడియా ప్రచారం జరుగుతోంది. ఈ తాజా బజ్ ప్రకారం.. ఈ సినిమా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో ఉండబోతున్నట్లు తెలుస్తోంది. దళపతి 67వ చిత్రంగా రాబోతున్న ఇందులో విజయ్ ఓ దాదాగా కనిపించనున్నాడట. ఇక ఇందులో విజయ్ ఇద్దరు హీరోయిన్లతో రొమాన్స్ చేయనున్నాడని సమాచారం. అంతేకాదు దాదాగా రేంజ్ తగ్గట్టుగా ఆరుగురు పవర్ఫుల్ విలన్స్ విజయ్ తలబోతున్నాడట. ఈ క్రమంలో విజయ్ వారిపై వేసే ఎత్తులు సస్పెన్స్ థ్రిల్లర్ ఉండనున్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ నటుడు సంజయ్ దత్ మెయిన్ విలన్‌గా కనిపంచనున్నాడని వినికిడి. సంజయ్‌తో పాటు మలయాళం స్టార్ హీరో పృథ్వీరాజ్, టాలీవుడ్ నుంచి కూడా ఓ ప్రముఖ నటుడిని ప్రతికథానాయకులుగా ప్లాన్ చేస్తున్న ఫిలిం దూనియాలో గుసగుల వినిపిస్తున్నాయి. మరి ఈ కథపై క్లారిటీ రావాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు. ఇటీవల విజయ్‌తో తన ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటించిన లోకేశ్ కనకరాజు ఇటీవల తాత్కాలికంగా సోషల్ మీడియాకు బ్రేక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి స్రీప్ట్ వర్క్ జరుగుతున్న నేపథ్యంలో కథ ఇలా బయటకు రావడంపై పలు సందేహాలు నెలకొన్నాయి. మరి దీనిపై దర్శకుడు, మూవీ టీం ఎలా స్పందిస్తుందో చూడాలి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in